

# చెప్పులు



“అరే పోశాలు, ఈ చెప్పులు దొరింట్ల ఇచ్చుకుంట బడికి పోరా!” కొడుకు పోచయ్యతో చెప్పాడు భూమయ్య.

భూమయ్య మోచీ. నలభై ఏళ్ళుంటాయి. పూర్వం చెప్పులు తయారుచేసేవాడు. ఇప్పుడు మానేశాడు. మానేశాడు అనే బదులు తక్కువ చేశాడు అంటే బాగుంటుందేమో. హైదరాబాద్ నుంచి చెప్పులు తెచ్చి అమ్ముతున్నాడు. కొందరికి మాత్రం చెప్పులు తయారుచేసి ఇస్తూ ఉంటాడు. చెప్పులు తయారు చేసి చేసి అతని చేతులు నాడాల్లాగా మారిపోయినవి. నాలుగెకరాల తరి పొలం. బజార్లో చెప్పుల దుకాణం. ఇద్దరు బిడ్డలు. ఒక కొడుకు. తన కొడుకు తనలాగా మోచీ కాకుండా బాగా చదువుకోవాలని పోచయ్యని చదివిస్తున్నాడు.

పోచయ్యకి పదమూడు సంవత్సరాలుంటాయి. చురుకైన కళ్ళు. బక్కపల్చగా ఉంటాడు. ఎనిమిదివ తరగతి చదువుతున్నాడు. ఎవరికైనా ఎందుకు లొంగి ఉండాలనే మనస్తత్వం. చదువులో బాగానే ఉన్నాడు. స్కూలుకి పోయే తొందరలో ఉన్నాడు. గూట్లో నుంచి పుస్తకాలు తీసుకొంటూ తండ్రి మాట విని అతని వైపు చూశాడు. భూమయ్య చెప్పులని కాగితంలో చుడుతున్నాడు.

“ఏంది నాయన నేను స్కూలుకి పొయ్యేటప్పుడు పని చెప్తవు. నువ్వు దుకాణమే పెడ్తివి. అవసరం వున్నవాళ్ళు దుకాణానికి వచ్చి తీసుకొనిపోరా ? మనమెందుకు వాళ్ళింటికి పొయ్యి ఇవ్వాలి” ప్రశ్నించాడు తండ్రిని.

కొడుకు ప్రశ్నకి ఆశ్చర్యపోయాడు భూమయ్య. అప్పుడప్పుడు కొడుకు ప్రశ్నలు అతన్ని ఆశ్చర్యపరుస్తుంటాయి. ఆలోచింపజేస్తుంటాయి. కొడుకు ప్రశ్నలో నిజముంది. దుకాణానికి వచ్చి వాళ్ళు తీసుకపోవచ్చు. తన తండ్రి కాలం నుంచి ఊళ్ళో దొరలందరి ఇండ్లకు వెళ్ళి చెప్పులు ఇవ్వడం అలవాటైపోయింది. ఇవ్వకపోతే ఏమిటీ ? ఆలోచిస్తేనే భయమేసింది.

“తొవ్వలనే గదరా! ఈ చెప్పులు దొర ఇంట్లో ఇచ్చుకుంట పోరాదు” మళ్ళీ చెప్పాడు.

“ఇయ్యకపోతే ఏమైతది నాయిన. నువ్వు అన్నిటికి బుగులు పడతవు” అన్నాడు పోచయ్య పుస్తకాలని చేతిలోకి తీసుకొంటూ.

“పోశాలూ! నాలుగక్షరాలు రాంగనే నువ్వు గిట్ల మాట్లాడుతున్నావుగానీ, నీకు తెలియదురా దొరల సంగతి. అన్నీ మనసుల పెట్టుకుంటరు. ఎక్కన్నో చూసి తొక్కుతరు. నా మాట విని ఇచ్చుకుంటపోరా! నువ్వియ్యకపోతే దుకాణం బంద్‌జేసి నేనే ఇచ్చివస్తాను”

"ఏం జేస్తరు నాయినా ?"

"ఏమైనా జేస్తరు. భూముల కాగితాలన్నీ గాళ్ళ దగ్గర వుంటాయి బిడ్డా! మన భూములల్ల ఎవలిదన్నా ఖబ్జారాస్తే సరిపోదా! నీకివ్వన్ని సమజుగాదురా నా మాట విను" భూమయ్యకి లక్ష్మీనారాయణ గుర్తుకొచ్చాడు. అతని భూమి గుర్తుకొచ్చింది. అతను ఎట్లా భూమి నుంచి బయటకు నెట్టివేయబడ్డాడో గుర్తొచ్చి భయమేసింది.

తండ్రి మాటలు పోచయ్యకి అర్థంకాలేదు. తండ్రి భయంలో ఏదో నిజముందని పించింది. ఏమీ మాట్లాడకుండా చెప్పుల్ని కుడిచేతిలోకి తీసుకొని, ఎడమచేతిలో పుస్తకాలు పెట్టుకొని బయటికి నడిచాడు.

పాముని కూడా చూసి భయపడని తండ్రి దొరకి అంత భయపడ్డం అతనికి ఆశ్చర్యం వేసింది. ఆలోచిస్తూ మూల మలుపు దాటి దొర ఇంటివైపు దారి తీశాడు పోచయ్య. దొర ఇల్లు దాటే బడికి వెళ్ళాలి. దొర ఇంటి ముందు నుంచి వెళ్తున్నప్పుడల్లా అక్కడి వాతావరణం వింతగా అన్పిస్తుంది. దొర పేరు రాంకిషన్‌రావు. అతను పట్వారీ. అతని అన్న జగన్మోహనరావు. అతను పటేల్. ఊరికి ఏ అధికారి వచ్చినా వాళ్ళింటికి వెళ్ళాల్సిందే. గిరిదావర్ నుంచి ఆర్డీవో వరకి, మోరీల్ సాబ్ నుంచి డియస్పీ దాక అందరూ అక్కడే మొకాం. సర్పంచ్ కూడా వాళ్ళ మనిషే. ఆలోచిస్తూ మెయిన్‌రోడ్డు మీదికొచ్చాడు పోచయ్య. తన క్లాస్ పిల్లలందరూ స్కూలుకి పోతున్నారు. చెప్పులిచ్చి స్కూలుకి వెళ్ళేసరికి రెండో బెల్ అయిపోతుందేమో. తండ్రి మీద కోపమొచ్చింది పోచయ్యకి.

ఊళ్ళో ముందటి పరిస్థితులు లేవు. హరిజనులు వెనుకబడ్డ తరగతుల వాళ్ళు అందరూ చదువుకొంటున్నారు. అయినా ఊరి మీద రాంకిషన్‌రావు కుటుంబం పట్టు ఇంకా పోలేదు.

దొర ఇంటి వద్దకొచ్చాడు పోచయ్య. ముందు పెద్ద పాటకు. లోపల ఇల్లు. ఇంటి ముందు గూర్ఖాల్లాగా ఇద్దరు సుంకర్లు కూర్చొని ఉన్నారు. బీడీలు కాలుస్తూ ఏదో ముచ్చట్లు పెట్టుకొంటున్నారు. పోచయ్య అక్కడికి వచ్చి కోర్టు ముందు ఖైదీలా నిల్చున్నాడు.

"ఏమిరా పిల్లగా ఎటో వచ్చినవు" అన్నాడు ఓ సుంకరి. బరిసె లాంటి ఆయుధం అతని పక్కన ఉన్నది.

"దొరకి చెప్పులు ఇయ్యమన్నడు మా అయ్య. అవి తెచ్చిన" సమాధానమిచ్చాడు పోచయ్య, చేతిలోని చెప్పులను చూపిస్తూ.

"ఉండు. దొర ఏం జేస్తున్నడో చూసి వస్తా" లేస్తూ అన్నాడు సుంకరి.

"నువ్వు ఇచ్చెయ్యరాదు. నేను స్కూలుకి పోవాలే" చెప్పులు అతని కివ్వబోతూ పోచయ్య అన్నాడు.

"ఏమిరో పోరగా, నీకు పైత్యమున్నట్టుంది దొరకి చెప్పులు ఇవ్వకుండనే పోతవా! సదివినవు తీ వుండుండు" అంటూ లోపలికి పోయిండు సుంకరి.

ఏం చెయ్యాలో తోచలేదు పోచయ్యకి. అట్లాగే నిల్చున్నాడు. లోపలికి పోయిన సుంకరి ఐదు నిముషాల తర్వాత వచ్చాడు.

"దొర పూజలున్నాడు, నిలబడు గొద్దిసేపు" పోచయ్యకి చెప్పాడు సుంకరి. పోచయ్య అట్లాగే నిల్చున్నాడు. కాళ్ళు పీకుతున్నాయి. ఆరోజు క్లాసు పోతుందని బాధగా ఉంది. తండ్రి మీద, దొర మీద కోపమొచ్చింది. ఏమీ చెయ్యలేక అట్లాగే నిల్చున్నాడు.

అరగంట గడిచింది.

"కొంచం చూసి రారాదు. నేను బడికి బోవాలె" సుంకరితో అన్నాడు పోచయ్య.

సుంకరి లోపలికి వెళ్ళి ఐదు నిముషాల తర్వాత వచ్చాడు. అతనివైపు ఆత్రుతగా చూశాడు పోచయ్య.

"రా! రా! పొల్లగా, దొర కచేరిల కొచ్చిండు" అంటూ లోపలికి దారి తీసిండు సుంకరి. అతని వెంట నడిచాడు పోచయ్య పుస్తకాలని చెప్పులని పట్టుకొని ఒక చేత్తో నిక్కరును సవరించుకొన్నాడు. గుబులు గుబులుగా అన్పించింది. హోమ్ వర్క్ చేయనప్పుడు కూడా అలా అన్పించలేదు.

పాటకు దాటి లోపలికి పోయినారు. పడగలాగా కన్పించింది లోపల బంగ్లా. పెద్ద దర్వాజా దాటి కచేరి దగ్గరికి పోయినారు. మడత కుర్చీలో కూర్చొని ఉన్నాడు రాంకిషన్‌రావు. ముప్పై అయిదు దాటి ఉంటాయి. మనిషి సాత్వికంగానే ఉన్నాడు.

"ఏంరా పొల్లగా మీ అయ్య రాలేదా? నీతోని పంపిండు" అన్నాడు దొర.

"రాలేదయ్యా" అంటూ చెప్పులు దొర కాళ్ళ దగ్గర పెట్టిండు పోచయ్య.

దొర కుర్చీ నుంచి లేచి చెప్పులు వేసుకొన్నాడు. అటూ ఇటూ నడిచి చూశాడు.

"కొంచెం కుత్తెమైనయిరా పొల్లగా తీస్కపోయి వొదలు చెయించుకు రా"

పోచయ్య దొర దగ్గరి నుంచి చెప్పులు తీసుకొన్నాడు. కాగితంలో చుట్టుకొని సుంకరితో పాటు బయటికి వచ్చాడు. బడికి పోలేడు. తండ్రి మీద కోపమొచ్చింది. చెప్పులతో బాటూ

ఇంటి మొఖం పట్టాడు.

❖ ❖ ❖

పది సంవత్సరాలు గడిచిపోయ్యాయి. ఈ పదేళ్ళ కాలంలో ఊళ్ళలోకి అన్నలొచ్చింరు. రాంకిషన్‌రావు పట్వారీతనం పోయింది. దొరతనం పోయింది. ఆయన భూములన్నీ పడావు పడ్డాయి. అమ్ముకోవడానికి అవకాశం లేదు. ఊళ్ళో ఉండే పరిస్థితి అంతకన్నా లేదు. ఊరు వదిలి కరీంనగర్ జేరిండు.

ఈ పదేళ్ళ కాలంలో పోచయ్య డిగ్రీ చదువైపోయింది. కాంపిటీటివ్ పరీక్షలు రాశాడు. ఎమ్మార్వో అయ్యాడు.

❖ ❖ ❖

క్లాక్ టవర్ పక్కన ఓ పెద్ద చెప్పుల షాప్. దాన్నిండా రకరకాల చెప్పులు. సాయంత్రం ఏడవుతోంది. రష్‌గా వుండి ముగ్గురు సేల్స్‌మెన్స్ కస్టమర్లకి హాజరవుతున్నా, ఇంకా కొంతమంది యజమానిని ఏదో అడుగుతున్నారు. అతను వచ్చి వాళ్ళకు చెప్పులు చూపిస్తున్నాడు. అవి నచ్చకపోతే వేరే మాడల్స్ చూపిస్తున్నాడు. అవి నచ్చకపోతే మరో మాడల్స్ చూపిస్తున్నాడు.

అప్పుడే పోచయ్య జీపులోక్లాక్‌టవర్ వద్దకొచ్చాడు చెప్పులు కొనుక్కోవడానికి. రోడ్డు పక్కన జీప్ ఆపి షాపులోకి వచ్చాడు. ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఎవరో కస్టమర్‌కి చెప్పులు తొడుగుతున్న యజమాని పోచయ్యని గుర్తుపట్టి కౌంటర్ వద్దకి వెళ్ళిపోయాడు. పోచయ్య కూడా అతన్ని గుర్తుపట్టాడు. ఆశ్చర్యపోయాడు. అతను రాంకిషన్‌రావు. 'ఎలాంటి మనిషి ఎలా అయిపొయ్యాడు!' అనుకొన్నాడు.

పోచయ్య చెప్పులు సెలక్టు చేసుకొని కౌంటర్ దగ్గరకొచ్చాడు బిల్ కట్టడానికి.

"ఏంరా పోచయ్య ఇప్పుడు ఇక్కడే ఎమ్మార్వోగా పని చేస్తున్నావట కదా!" అన్నాడు రాంకిషన్‌రావు పోచయ్య దగ్గరి నుంచి డబ్బులు తీసుకొంటూ. రాంకిషన్‌రావు పలకరింపుతో పోచయ్య గుండె కలుక్కుమంది. తను రాగానే కస్టమర్‌కి చెప్పులు చూపిస్తున్న రాంకిషన్‌రావు కౌంటర్ దగ్గరికి వెళ్ళిపోవడం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అప్పటివరకు మర్చిపోయిన తన కులం గుర్తుకు వచ్చింది పోచయ్యకి. వృత్తులు మారిపోయినవి. తమ వృత్తి రాంకిషన్‌రావు చేస్తున్నాడు. అతని వృత్తి తను చేస్తున్నాడు. ముప్పై గ్రామాలకు తను అధికారి. అయినప్పటికీ

రాంకిషన్‌రావు ప్రవర్తన తన పట్ల మారలేదు. అతని వృత్తి మారింది. ప్రవృత్తి మారలేదు. చెప్పులు తీసుకొని బయటకు నడిచాడు పోచయ్య.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 20-1-1995*



